క్లుప్తంగా

ఒంగోలులో ఈద్ నమాజు వేళలు

ఒంగోలు టౌన్: నెల రోజులపాటు ఉపవాసాల దీక్షలు పాటించిన ముస్లింలు బుధవారం నింగిలో నెలవంక కనిపించడంతో రంజాన్ పండుగను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. గురువారం జిల్లా అంతటా ముస్లింలు రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజులు ఆచరించనున్నారు. ఈద్గా మైదానం వరకు వెళ్లేందుకు అవకాశం, వెసులుబాటులేని భక్తుల కోసం ఆయా ప్రాంతాలలోని మస్జిద్‌లలో ఈద్ నమాజ్ చదివించేందుకు మత పెద్దలు ఏర్పాటు చేశారు. ఒంగోలు నగరంలోని మదీనా, జుబేదా మస్జిద్‌లలో ఉదయం 7.30 బయాన్, 8 గంటలకు నమాజ్ జరుగుతుందని మతపెద్ద సయ్యద్ హమీద్ తెలిపారు. గంటపాలెం, అన్నవరపాడు, పోలీసు క్వార్టర్స్ మస్జిద్‌లలో 8 గంటలకు బయాన్, 8.30కు నమాజ్ జరుగుతుందని వివరించారు. బిలాల్ మస్జిద్‌లో 8.30కు బయాన్, 9 గంటలకు నమాజ్ జరుగుతుందన్నారు. మక్కా, రహమత్ మస్జిద్‌లలో 9 గంటలకు బయాన్, 9.30కు నమాజ్ నిర్వహిస్తారని, మర్కస్, హుదా, హుసేని, జామియా మస్జిద్‌లలో 9.30 గంటలకు బయాన్ మొదలవుతుందని, 10 గంటలకు నమాజ్ చదివించడం జరుగుతుందని తెలిపారు. ఇస్మాయిల్, నిసార్ మస్జిద్‌లలో 10 గంటలకు బయాన్, 10.30కు నమాజ్ చదివించడం జరుగుతుందని, ఈద్గా మైదానంలో 10.30కు బయాన్, 11 గంటలకు నమాజ్ జరుగుతుందని తెలిపారు. ముస్లింలు ఈ నమాజ్ వేళలు గమనించాలని, వీలైనంత త్వరగా ఈద్ నమాజ్ చేసుకునేందుకు ప్రయత్నించాలని కోరారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడొద్దు

చీమకుర్తి: ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్ రౌడీషీటర్లను హెచ్చరించారు. మండలంలోని రౌడీషీటర్లను బుధవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఎలా ప్రవర్తించాలో అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినా, ఘర్షణలకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: దళితుల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం చీమకుర్తిలోని తన కార్యాలయంలో దళిత ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దళిత ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా దళిత ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్ ఆశయాల స్ఫూర్తితో దళిత సంఘాల నాయకులు ముందుకు నడవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుజన్‌మాదిగ, దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, శేఖర్, గణేష్, పాలడుగు సుబ్బారావు పాల్గొన్నారు.

శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

ఒంగోలు రూరల్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలోని కరవది గ్రామంలో సీతారామచంద్రస్వామి, శ్రీవేణుగోపాల స్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి 133వ వార్షిక బ్రహ్మోత్సవాలను, నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. దేవస్థానం ఈవో వెలగం శ్రీనివాస్, పర్యవేక్షకుడు డి.నాగరంగయ్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అంకురార్పణ చేశారు. గురువారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి 8 గంటలకు శేషవాహనసేవ, 12వ తేద స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు సింహ, వ్యాళి, వ్యాఘ్ర వాహన సేవలు, 13వ తేదీ ఉదయం గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు హంస, భృంగి, పొన్నమాను వాహన సేవలు, 14వ తేదీ గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు హనుమ, రావణ వాహన సేవలు, 15వ తేదీ గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు గరుడ, నంది వాహన సేవలు, 16వ తేదీ ఉదయం 8 గంటలకు మోహిని ఉత్సవం, రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, 17వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా స్వామివార్ల కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం, తిరునాళ్ల నిర్వహించనున్నారు. 19వ తేదీ వసంత ఉత్సవం చక్రస్నానం, 20వ తేదీ స్వామివారి ఏకాంత సేవ నిర్వహించనున్నారు. ప్రతిరోజూ నాగస్వర కచేరి, 11వ తేదీ భక్తిగీతాల కచేరి, 12వ తేదీ సంగీత విభావరి, 13వ తేదీ సత్యహరిశ్చంద్ర నాటకం, 14న మ్యాజిక్ షో, 15న నాట్య ప్రదర్శనలు, 16న దేవనర్తకి నాటకం ప్రదర్శించనున్నారు. భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తా

- ఎన్నికల ప్రచారంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



ఒంగోలు 21వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మరోసారి తనకు అవకాశమిస్తే ఒంగోలు నగరంలోని 21వ డివిజన్‌ను పూర్తిగా అభివృద్ధి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని 21వ డివిజన్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన 5 ఏళ్ల పాలనలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. గ్రామ సచివాలయం, గ్రామ వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా భావించి పరిపాలన అందించారన్నారు. గత ఐదేళ్లలో ఒంగోలును ఎంతో అభివృద్ధి చేశామని బాలినేని వివరించారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ఇళ్లు లేని నిరుపేదలు 25 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలు అందించామని గుర్తు చేశారు. ఈ ఎన్నికలలో కూడా గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ ఇళ్లు కూడా కట్టిస్తానని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ నాయకులు అబద్ధాలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్నారని, ప్రజలంతా వారికి గుణపాఠం చెప్పాలని సూచించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు ముందుగా బాలినేనికి ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి టెంకాయలతో దిష్టితీసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. గడపగడపకూ తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటూ డివిజన్‌లో తాను చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ బాలినేని ముందుకు సాగారు. ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు.

మరొక అవకాశం ఇస్తే మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, కార్పొరేటర్ యనమల నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రిమ్స్ వద్ద అన్యాయాన్ని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, మేయర్ గంగాడ



చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బాలినేని



రిమ్స్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

రిమ్స్ వద్ద ఉద్రిక్తత

ఒంగోలు సమతానగర్‌లో వైఎస్సార్ సీపీ ప్రచారాన్ని టీడీపీ వర్గీయులు అడ్డుకుని దాడికి పాల్పడిన అనంతరం క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించగా, పరామర్శించేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, భారీగా పార్టీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూడా అక్కడే ఉండి రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో భారీగా పోలీసులు మోహరించారు. దీంతో బుధవారం అర్ధరాత్రి వరకూ రిమ్స్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. – సాక్షి, ఒంగోలు

ఆశీర్వదించండి.. సేవ చేస్తాను



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మేరుగు నాగార్జున

- మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున సంతనూతలపాడు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని, ఐదేళ్ల పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. చీమకుర్తి మండలం తొర్రగుడిపాడులో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంతనూతలపాడు నియోజకవర్గ ప్రజలంతా మంచి మనసుతో ఆలోచించి గత ఐదేళ్లుగా కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేసి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి తమను గెలిపిస్తే నిస్వార్థంగా సేవ చేస్తామని చెప్పారు. సంతనూతలపాడు నియోజకవర్గానికి కొత్తవాడినైనా తనను పూర్తిగా ఆదరించి వెన్నంటి నిలుస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అందుకోసం రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ చీమకుర్తి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, శ్రీధర్ల శేషు, వెలగల కృష్ణమూర్తి, శ్రీను, బత్తుల సుబ్బారావు, తిరుపతి స్వామి, అప్పారావు, వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు...

తొర్రగుడిపాడు గ్రామంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి మేరుగు నాగార్జున సమక్షంలో పలువురు టీడీపీ నాయకులు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. కొనికి వెంకటేశ్వర్లు, కొనికి హనుమంతరావు తదితర 5 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరారు.

వాహనాలను పక్కాగా తనిఖీ చేయాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ

మద్దిపాడు: ఓటర్లను ప్రభావితం చేసేలా డబ్బు, ఇతర వస్తువుల రవాణాను సమర్థవంతంగా అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాలను పక్కాగా తనిఖీ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దినేష్ కుమార్ ఆదేశించారు. తనిఖీ సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం తగదని ఆయన స్పష్టం చేశారు. మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును బుధవారం రాత్రి సంతనూతలపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. వాహనాలను తనిఖీ చేస్తున్న తీరు, సంబంధిత వివరాలతో రికార్డు నిర్వహిస్తున్న విధానంపై కలెక్టర్ ఆరా తీశారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా తరలిస్తున్నట్లుగా అనుమానంతో స్వాధీనం చేసుకునే డబ్బు, ఇతర వస్తువుల వివరాలను ఈఎస్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని, జిల్లా గ్రీవెన్స్ విభాగ అధికారులకు తగిన ఆధారాలు చూపించి ఆ డబ్బును తిరిగి పొందేలా సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని, తనిఖీ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ కూడా చేయాలని చెక్‌పోస్టులోని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఈఆర్ఓ గోపాలకృష్ణ, మండల తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీల ఖర్చు రూ.20.53 లక్షలు

- అక్రమంగా తరలిస్తున్న రూ.3.83 లక్షలు స్వాధీనం



మాట్లాడుతున్న ఆర్ఓ, జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి: సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇప్పటి వరకు పలు పార్టీల తరఫున పెడుతున్న ఖర్చు రూ.20,53,362గా నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం చీమకుర్తిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అక్రమంగా తరలిస్తున్న రూ.3,83,990 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 256 పోలింగ్ బూత్‌లలో పాల్గొనే ఎన్నికల సిబ్బందికి మొదటి విడత శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు.

మతోన్మాద బీజేపీ మిత్ర పక్షాలను ఓడించండి

ఒంగోలు టౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన మతోన్మాద బీజేపీ, దాని మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలను ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం సీపీఎం ప్లీనం సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీనియర్ నాయకులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రజల ప్రయోజనాల రక్షణకు, లౌకికత్వం పరిరక్షణకు మతోన్మాద శక్తులను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కూటమి గెలిస్తే ప్రజలకు కడగండ్లు తప్పవని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చేయాలన్న కుట్రలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యం పట్ల ఏమాత్రం గౌరవం లేని మనువాదులతో చేతులు కలిపిన టీడీపీ, జనసేన పార్టీలకు గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి, జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి, ఎస్‌కే మాబు, చీకటి శ్రీనివాసరావు, ఉసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

పలువురు వలంటీర్లు రాజీనామా



రాజీనామా లేఖలను ఈఓపీఆర్‌డీకి అందిస్తున్న ఘడియపూడి వలంటీర్లు



తొర్రగుడిపాడు పంచాయతీ సెక్రటరీకి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు



ఇలపావులూరు పంచాయతీ సెక్రటరీకి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

మద్దిపాడు: మండలంలోని ఘడియపూడి పంచాయతీ పరిధిలో ముగ్గురు వలంటీర్లు బుధవారం తమ రాజీనామా పత్రాలను ఈఓపీఆర్‌డీ రఘుబాబుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు, ఆయన బృందం, పచ్చపత్రికలు కించపరుస్తూ నీచంగా మాట్లాడటం సహించలేకపోతున్నామని అన్నారు. చంద్రబాబు ధోరణి సక్రమంగా లేదని, అందుకు నిరసనగా తాము రాజీనామా చేస్తున్నామని తెలిపారు. రాజీనామా చేసిన వలంటీర్లలో అనపర్తి చిరంజీవి, రావూరి అశోక్‌రెడ్డి, బొమ్మల కోటేశ్వరరావు ఉన్నారు.

చీమకుర్తి మండలంలో 17 మంది...

చీమకుర్తి రూరల్: చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామ సచివాలయ పరిధిలో గోనెపల్లివారిపాలెం, ఇలపావులూరు గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు, తొర్రగుడిపాడు గ్రామానికి చెందిన ఆరుగురు వలంటీర్లు బుధవారం స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామాలు చేశారు. వలంటీర్ల పట్ల పవన్ కళ్యాణ్, చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాలు తమను అసభ్యకర పదజాలంతో మాట్లాడటాన్ని ఖండించారు. ఇలపావులూరు గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్లు గోనెపల్లి రామాంజనేయులు, గోనెపల్లి శ్రీలక్ష్మి, కోనేటి చందు, బోడిపోగా విజయ వాణి, బోడిపోగా ఎలిజిబెత్, శ్రీవిద్య, సుక్క సురేష్, పులి పావని, మిరియాల సులోచన, వల్లెపు శివ, రజిని రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఇలపావులూరు పంచాయతీ సెక్రటరీ సుబ్బారావుకు అందజేశారు. తొర్రగుడిపాడు గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్లు కోటు నాగమల్లేశ్వరి, యద్దనపూడి శ్రీనివాసరావు, మారేబోయిన శివరామకృష్ణ, తెల్లమేకల శ్రావణి, దీట్ల సుకన్య, సాపాటి రాజశేఖర్ రాజీనామా చేసి ఆ పత్రాలను తొర్రగుడిపాడు పంచాయతీ సెక్రటరీ శంకర్‌కు అందజేశారు.

కొత్తపట్నం మండలంలో 58 మంది...

కొత్తపట్నం: వలంటీర్లపై టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు, కుట్రలకు నిరసనగా మండలంలోని 58 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేసి ఆ పత్రాలను ఎంపీడీవో ఎం.ఫణి కుమార్‌నాయక్‌కు అందజేశారు. కొత్తపట్నం సచివాలయం–1 పరిధిలోని 17 మంది వలంటీర్లు, సచివాలయం–2లోని 19 మంది, మోటుమాల 11, గుండమాల 2, ఆలూరు 1, రంగాయపాలెం 8 మంది వలంటీర్ల చొప్పున రాజీనామా చేశారు. కార్యక్రమంలో పురిణి వెంకటేశ్వర్లు, జొన్నా భార్గవి, మాకాని వెంకటేశ్వర్లు, దాసరి రాధిక, కాకి విక్టోరి, మోటుపల్లి దిలీప్, రాగాల రవికుమార్, క్రిష్టం వెంకట్రావు, గొరవరపు సంజీవులు, బత్తల పావని, కుందుర్తి భూలక్ష్మి, చిక్కాల కృపారావు, శ్రీదివ్య, కోడూరి తిరుపతి, ఆట బ్రహ్మయ్య, జజ్జర ప్రతాప్, గుండుబోయిన రామిరెడ్డి, చినిగే ప్రసన్న, పురిణి శ్రీలేఖ, పురిణి వనజ, తంబి జయంతి, కోడూరి ఉమామహేశ్వరి, శ్రీకాంత్‌రెడ్డి, ద్వారం గోపీరాజ్, ద్వారం వెంకటనాగార్జున, కన్నా రామాంజనేయులు, షేక్ ఆఫ్రోజ్, దమాల రూతు, రావుల రాజకల్యాణి, సునీత పాల్గొన్నారు.

ఉలిచి గ్రామంలో 8 మంది...

ఒంగోలు రూరల్ : మండలంలోని ఉలిచి సచివాలయం పరిధిలో పనిచేస్తున్న 8 మంది వలంటీర్లు ఒంగోలు ఎంపీడీవో బండి శ్రీనివాసరావుకు బుధవారం తమ రాజీనామా పత్రాలు అందజేశారు. బుధవారం సాయంత్రం ఎంపీడీవోను కలిసిన సాలె మహేష్, పాలేటి వినయ్, పాలేటి సునీత, చేజర్ల వనజ, చప్పిడి త్రివేణి, కొత్తపల్లి సునధ, గరికపూడి చైతన్య, సందరపాటి ప్రభావతి రాజీనామా లేఖలను ఎంపీడీవోకు అందజేశారు.



ఒంగోలు ఎంపీడీవోకు రాజీనామా లేఖలు అందజేస్తున్న ఉలిచి వలంటీర్లు

టోఫెల్ పరీక్షకు ఐఎఫ్‌పీ ప్యానల్ కేటాయించాలి

ఒంగోలు: టోఫెల్ పరీక్షకు ఎయిడెడ్ పాఠశాలలకు ఐఎఫ్‌పీ ప్యానల్ కేటాయించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ టీవీలను సప్లయ్ చేసి ప్రభుత్వ విద్యార్థులతో సమానంగా ఎయిడెడ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించాలని కోరారు.

మహనీయుడు.. మహాత్మా జ్యోతీరావుపూలే



మాట్లాడుతున్న ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు

ఒంగోలు: విద్య ద్వారా సామాజిక రుగ్మతలు తొలగించేందుకు కృషిచేసిన మహనీయుడు మహాత్మా జ్యోతీరావుపూలే అని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి.హరిబాబు కొనియాడారు. బుధవారం స్థానిక ఏకేయూ సమావేశ మందిరంలో నిర్వహించిన పూలే 197వ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాటి రోజుల్లో సమాజంలో పాతుకుపోయిన కుల వివక్ష, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించి మహిళా విద్య ద్వారా వ్యవస్థను మార్చేందుకు అహర్నిశలు శ్రమించిన మహనీయుడు పూలే అని వివరించారు. నేటి యువత పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని లక్ష్య సాధనలో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజమోహన్, సీఈ డాక్టర్ కేవీఎన్ రాజు, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్, ఉమన్స్ సెల్ సమన్వయకర్త డాక్టర్ అంచుల భారతీదేవి, ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వీఆర్ఏలకు తీవ్రగాయాలు

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రాత్రి విధులు నిర్వహించి బుధవారం ఉదయం ఆరుగంటల సమయంలో ఇంటికి వెళ్తున్న ఇద్దరు వీఆర్ఏలను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తీవ్రగాయాలయ్యాయి. ఆ వివరాల ప్రకారం.. కొలచనకోట వీఆర్ఏ తేళ్ల నరసింహారావు, వెల్లంపల్లి వీఆర్ఏ చల్లపల్లి వెంకటేశ్వర్లు గ్రోత్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో మంగళవారం రాత్రి విధులు నిర్వహించి బుధవారం తిరిగి ఇంటికి వెళ్తున్నారు. గుండ్లాపల్లి వద్ద ఉన్న పెట్రోలు బంకులోకి వెళ్లి పెట్రోలు కొట్టించుకుని జాతీయ రహదారిపైకి వచ్చే క్రమంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిద్దరికీ కుడికాళ్లు విరిగిపోయాయి. స్థానికులు స్పందించి వెంటనే 108 ద్వారా ఒంగోలు తరలించగా ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న మద్దిపాడు ఎస్ఐ వి.మహేష్ ఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన జేసీ...

సమాచారం అందుకున్న మద్దిపాడు తహసీల్దార్ అనూరాధ, జేసీ గోపాలకృష్ణ ఒంగోలులో ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరారు.